సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం ၊ 23 ၊ డిసెంబర్ ၊ 2023



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



27 నుంచి స్పాట్ అడ్మిషన్లు

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మిగులు సీట్లకు ఈనెల 27 నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఎస్కేయూ అధికారులు తెలిపారు. 8లో

గరిష్టం/కనిష్టం
32.8°/15.2°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత బాగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

‘ఆడుదాం ఆంధ్రా’ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లా యంత్రాంగం అంతా సమష్టిగా పనిచేసి ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీలను విజయవంతం చేద్దామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన జిల్లా క్రీడా ప్రాధికార అధికారి ఉదయ్‌భాస్కర్, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తదితరులతో కలిసి ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్రీడాపోటీల ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడా పోటీలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేసి పోటీలను విజయవంతం చేయాలన్నారు. వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ, షటిల్ తదితర 5 అంశాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటారన్నారు. 15 ఏళ్లు పైబడిన వారందరూ పాల్గొనేలా చూడాలన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని పోటీలను విజయవంతం చేయాలన్నారు.

నేడు జిల్లాకు కేంద్రమంత్రి దేవ్‌సిన్హ చౌహాన్

పుట్టపర్తి అర్బన్: కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి దేవ్‌సిన్హ చౌహాన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం జిల్లాకు విచ్చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగే జరిగే ‘వికసిత్ భారత్ సంకల్ప యాత్ర’లో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. శనివారం ఉదయం హిందూపురం మండలంలోని కిరికెర, మధ్యాహ్నం పాలకుంటలో జరిగే ‘వికసిత్ భారత్ సంకల్ప యాత్ర’లో పాల్గొంటారన్నారు. అనంతరం పుట్టపర్తి చేరుకొని రాత్రికి బస చేస్తారని వివరించారు. 24వ తేదీ ఆదివారం ఉదయం లేపాక్షిలో, మధ్యాహ్నం చిలమత్తూరులో జరిగే ‘వికసిత్ భారత్ సంకల్ప యాత్ర’లో పాల్గొంటారని వెల్లడించారు.

ప్రీ రిపబ్లిక్‌డే క్యాంప్‌నకు యామిని ఎంపిక



యామిని యాదవ్‌ను అభినందిస్తున్న జేఎన్‌టీయూ వీసీ రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ (ఈఈఈ) నాలుగో సంవత్సరం చదువుతున్న వై.యామిని యాదవ్ ఈ నెల 31 నుంచి న్యూఢిల్లీలో నిర్వహించే ప్రీ రిపబ్లిక్‌డే క్యాంప్‌కు ఎంపికైంది. యామిని యాదవ్‌ను వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద శుక్రవారం అభినందించారు.

26న జెడ్పీ సర్వసభ్య సమావేశం



అనంతపురం సిటీ: ఉభయ జిల్లాల జెడ్పీ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న ఉదయం 10.30 గంటలకు అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఈఓ లలితాబాయి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ప్రారంభమయ్యే సమావేశానికి మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు రెండు జిల్లాల కలెక్టర్లు గౌతమి, అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్లు, జెడ్పీటీసీ, కో–ఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు తప్పక హాజరు కావాలని కోరారు. గత సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన అంశాలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలతో పాటు సమగ్ర వివరాలతో రావాలని అన్ని శాఖల అధికారులకు ఇప్పటికే సమాచారం అందించామని వెల్లడించారు.

టీడీపీలో ‘వెనుక’బాటే!

- హిందూపురంలో బీసీ వర్గానికి చెందిన ఓ నేత రెండు దశాబ్దాలుగా టీడీపీ జెండా మోస్తున్నారు. మైనార్టీ నేత అబ్దుల్ ఘని తర్వాతైనా తనకు అసెంబ్లీ సీటు ఇస్తారని ఆశించారు. కానీ అధిష్టానం బాలకృష్ణను తెరపైకి తెచ్చింది. దీంతో సదరు నేత పదేళ్లుగా బాలకృష్ణ పల్లకీ మోస్తూ వచ్చాడు. ‘ఎన్నాళ్లిలా’ అంటూ తన వర్గం నుంచే వ్యతిరేకత రావడంతో కండువా మార్చేందుకు సిద్ధమయ్యారు.
- పుట్టపర్తికి చెందిన మరో బీసీ నాయకుడు కూడా దశాబ్దకాలంగా టీడీపీ జెండా మోస్తున్నాడు. అతని ద్వారా బీసీల ఓట్లకు గాలం వేస్తున్న అధిష్టానం.. అసెంబ్లీ సీటు మాత్రం ఇవ్వడం లేదు. పెత్తనమంతా ‘పల్లె’కు కట్టబెట్టగా...పల్లకీ మోతతో సదరు నేత అలసిపోయారు. త్వరలోనే కీలక నిర్ణయం తీసుకుని అధిష్టానానికి బీసీల సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు.

...ఇలా..ఇన్నాళ్లూ టీడీపీ జెండా మోసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. తమను జెండా కూలీలుగా చూస్తున్న చంద్రబాబుకు బుద్ధి చెప్పాలనుకుంటున్నారు. బడుగు, బలహీన వర్గాలను అక్కున చేర్చుకుని, రాజ్యాధికారం కట్టబెడుతున్న పార్టీవైపు చూస్తున్నారు.

- పెత్తందార్లకే అధిక ప్రాధాన్యం
- బీసీ, ఎస్సీలకు మొండిచెయ్యి
- మైనార్టీలను పక్కనపెట్టిన చంద్రబాబు
- ఓటు బ్యాంకుగా వాడి వదిలేస్తున్న వైనం
- అధినేత బాటలోనే స్థానిక టీడీపీ నేతలు
- ప్రతి చోటా కుల రాజకీయాలు చేస్తూ దబాయింపు

సాక్షి, పుట్టపర్తి

తెలుగుదేశం పార్టీలో దశాబ్దాల కాలంగా కొనసాగిన వారికి నేడు గుర్తింపు లేకుండా పోయింది. పార్టీ గెలుపు కోసం జెండా మోసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం టీడీపీ పెద్దలకు అలవాటైంది. బడుగులను జెండా మోసే కూలీలుగా చూస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కేవలం పెత్తందార్లకే ఆధిపత్యం ఇవ్వడంపై బడుగు, బలహీన వర్గాల తమ్ముళ్లంతా అసంతృప్తిగా ఉన్నారు. ఫలితంగా గ్రామ స్థాయిలో టీడీపీ ఖాళీ అయ్యింది. గత సార్వత్రిక ఎన్నికలతో పాటు ఆ తర్వాత జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ వార్డు స్థాయి నుంచి టీడీపీ బొక్కబోర్లా పడిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ఎన్నో ఏళ్లుగా పార్టీ వెంట నడిచిన వారు ఒక్కొక్కరుగా వీడిపోతున్నారు. అయినా ఆ పార్టీ పంథా మాత్రం మారడం లేదు.



పగ్గాలు ఒకరికి.. పెత్తనం మరొకరికి..

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పెత్తందార్లకే పెత్తనం కట్టబెట్టారు. ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో కూడా అంతా బడాబాబులకే పెద్దపీట వేస్తున్నారు. ఒకటి, రెండు చోట్ల పేరుకు బీసీలకు పగ్గాలు ఇచ్చినప్పటికీ... వారిని కూడా పరిటాల కుటుంబమే ఆడిస్తోంది. ప్రస్తుతం టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా బీకే పార్థసారథి ఉన్నప్పటికీ.. అన్ని నిర్ణయాల్లో పరిటాల సునీత నిర్ణయమే ఫైనల్ అవుతోంది. అధిష్టానం వద్ద బీకే చెల్లని కాసు కాగా..పరిటాల సునీతే హవా నడిపిస్తోంది. ఫలితంగా బీకే వెంట నడిచినా.. ఎలాంటి ప్రయోజనం ఉండబోదని చాలామంది ఆయన వర్గీయులు ఒక్కొక్కరూ దూరం అవుతున్నారు.

పేరు ఈరన్న.. పెత్తనం గుండుమల..

మడకశిర నియోజకవర్గం 2008 నుంచి ఎస్సీలకు రిజర్వు అయ్యింది. అయితే నియోజకవర్గంలో ఎస్సీ లకు టికెట్ ఇచ్చినా.. అక్కడంతా బడాబాబులదే పెత్తనం నడుస్తోంది. పేరుకు ఈరన్న ఉన్నా... నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు మాత్రం వ్యాపారవేత్త గుండుమల తిప్పేస్వామికి ఇచ్చారు. దీంతో ఎస్సీ సామాజిక వర్గీయులు టీడీపీ వెంట నడిచేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఈరన్నను 2019 తర్వాత నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా నియమించారు. అయితే ఆ తర్వాత గుండుమల తిప్పేస్వామి తనదైన శైలిలో అధిష్టానం వద్ద లాబీయింగ్ చేసుకుని పగ్గాలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఈరన్నను అడుగడుగునా అవమానిస్తూ వస్తున్నారు. ఏదైనా పార్టీ సభ జరిగినా ఈరన్న పేరు కూడా ప్రస్తావించడం లేదు. దీంతో ఈరన్న వర్గమంతా గుండుమల తిప్పేస్వామితో పాటు పార్టీ అధిష్టానంపై గుర్రుగా ఉంది.

మైనార్టీలకు మొండిచెయ్యి..

నందమూరి బాలకృష్ణ ప్రాతినిథ్యం వహిస్తున్న హిందూపురంలో ముస్లిం ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అంతేకాకుండా 2009లో అబ్దుల్ ఘని టీడీపీ తరఫున పోటీ చేసి గెలిచారు. అయితే ఆ తర్వాత నందమూరి బాలకృష్ణ రాజకీయ ప్రవేశం కోసం ఘనిని పక్కనబెట్టారు. పార్టీలో ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో విసుగుచెందిన ఆయన వైఎస్సార్ సీపీలో చేరారు. కదిరిలోనూ మైనార్టీ నేతలను టీడీపీ అవసరానికే వాడుకుంటోంది. వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచిన అత్తార్ చాంద్ బాషాకు లేనిపోని ఆశలు పెట్టి పచ్చకండువా కప్పేసింది. ఆ తర్వాత కూరలో కరివేపాకులా తీసిపడేసింది. ఇప్పుడు అక్కడ అంతా కందికుంట రాజ్యమే నడుస్తోంది. కందికుంటకే టీడీపీ సీటు ఇస్తామని ఇటీవల కదిరిలో పర్యటించిన చంద్రబాబు చెప్పకనే చెప్పారు. పక్కనే ఉన్న అత్తార్ ఆశలన్నీ అడియాసలు కాగా, మైనార్టీలంతా తమను మోసం చేసిన బాబుకు బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు.

బీసీ కార్డుతో మోసం..

టీడీపీ బీసీల పార్టీ అని చంద్రబాబు పదేపదే చెబుతుంటారు.. కానీ ఆ దిశగా న్యాయం చేయడం లేదని పుట్టపర్తి నియోజకవర్గంలోని చాలా మంది బీసీ నాయకులు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని.. పెత్తందార్లకే మద్దతు పలకడం చంద్రబాబు నైజమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెనుకొండలో ఏకంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథిని కాదని కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకున్న సవితమ్మకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ధర్మవరం, రాప్తాడులో పరిటాల కుటుంబ సభ్యులు ఇన్‌చార్జ్‌లుగా ఉన్నారు. హిందూపురంలో నందమూరి బాలకృష్ణ, పుట్టపర్తిలో పల్లె రఘునాథ రెడ్డి ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. ఇలా ఎక్కడైనా టీడీపీలో పెత్తందార్ల పెత్తనమే సాగుతోంది. దీంతో దశాబ్దాలుగా పచ్చ నేతల పల్లకీ మోసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలంతా కండువా మార్చే పనిలో పడ్డారు.

6న జేఎన్‌టీయూ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా గవర్నర్ రాక



బుక్కరాయసముద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం/ శింగనమల: జేఎన్‌టీయూ అనంతపురం స్నాతకోత్సవం జనవరి 6న నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్/చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. అదే రోజు బుక్కరాయసముద్రం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించే ‘వికసిత్ భారత్ సంకల్ప యాత్ర’ కార్యక్రమంలోనూ గవర్నర్ పాల్గొననున్నారు. బుక్కరాయసముద్రంలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ శుక్రవారం పరిశీలించి, అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. జేసీ వెంట డీపీఓ ప్రభాకర్‌రావు, తహసీల్దార్లు రమాదేవి, హరికుమార్, ఎంపీడీఓ తేజోస్న తదితరులు ఉన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని జిల్లా ట్రెజరీ అధికారి నాగమల్లిక శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. 2024 జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 29వ తేదీలోపు సమీపంలోని ఉప ఖజానా కార్యాలయాల్లో గానీ, మీసేవ, ఆన్‌లైన్ పద్ధతి, జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా గానీ సమర్పించవచ్చన్నారు. తపాలా శాఖ పెన్షనర్ల కోసం నామమాత్రపు రుసుంతో కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసిందన్నారు. అవసరమైతే ఇంటి వద్దకే వచ్చి లైఫ్ సర్టిఫికెట్ స్వీకరించే సేవలు కూడా ప్రారంభించిందన్నారు. ఏ రూపంలోనైనా సరే గడువులోపు పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని సూచించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు స్థల సేకరణ
- జేసీ అభిషేక్ కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల



మాట్లాడుతున్న అవుటాల రమణారెడ్డి, జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని, వాటిని అర్హులందరికీ అందజేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అవుటాల రమణారెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, ఎన్‌జీ రంగా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న కృషి విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చిన్న, సన్న కారు రైతులకు పొట్టేళ్లు, కోళ్లు, పందుల పెంపకానికి రుణాలు ఇచ్చేందుకు జాతీయ బ్యాంకులు ముందుకు రావడం లేదన్నారు. అందువల్ల సహకార బ్యాంకుల ద్వారా రైతులకు సబ్సిడీ రుణాలు మంజూరు వేగవంతం చేయాలన్నారు. పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు అందించడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు తరచూ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యాన, చిరుధాన్యపు పంటల సాగుకు జిల్లాలో అనువైన వాతావరణం ఉన్నందున ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందించాలన్నారు. అనంతరం ప్రభుత్వం ప్రకటించిన కరువు జాబితాలేని 11 మండలాలను కరువు జాబితాలో చేర్చాలని తీర్మానం చేశారు.

ఎరువుల కొరత లేకుండా చూడండి..

జేసీ అభిషేక్‌కుమార్ మాట్లాడుతూ, రబీలో ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. ‘జగనన్న పాలవెల్లువ’ పథకంపై పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఉద్యాన పంటలపై రైతులకు ఇచ్చే రాయితీలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో తీర్మానించే అంశాలను ఆయా శాఖల ఆధ్వర్యంలో నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోవు సమావేశంలో బ్యాంకర్ల ద్వారా రైతులకు ఇచ్చే రుణాలపై చర్చిస్తామన్నారు. బ్యాంకర్లు సరైన ప్రణాళికలు తీసుకురావాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు మాట్లాడుతూ.. రైతులు ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రబీకి అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచామన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, పట్టు పరిశ్రమ శాఖ జేడీ పద్మమ్మ, పశు సంవర్ధక శాఖ అధికారి శుభదాస్, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఈఈ మురళీ, మైనర్ ఇరిగేషన్ డీఈ గంగాధర్, శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రాయుడు, డాక్టర్ వేమన, డాట్ సెంటర్ శాస్త్రవేత్త రవికిశోర్, సభ్యులు హనుమంతరెడ్డి, కేశవరెడ్డి, రవి చంద్రారెడ్డి, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు వెంటనే పరిహారం అందివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

- జేసీ అభిషేక్ కుమార్ ఆదేశం

పుట్టపర్తి అర్బన్: జాతీయ రహదారులు, వివిధ రైల్వే లైన్ల కోసం భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించే ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో జాతీయ రహదారులు, రైల్వే లైను పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... జిల్లా పరిధిలో వెళ్లే జాతీయ రహదారుల కోసం ఇప్పటి వరకూ 2,390 ఎకరాలు సేకరించామన్నారు. ఎక్కడా ఎలాంటి సమస్య రాకుండా అధికారులు, సిబ్బంది చక్కగా పని చేశారని అభినందించారు. జాతీయ రహదారులతో పట్టణాలకు కనెక్టివిటీ పెరుగుతుందని, దీనివల్ల జిల్లా అభివృద్ధికి మార్గం సుగమమవుతుందన్నారు. అనంతరం ఇప్పటి వరకూ సేకరించిన భూమి, రైతులు అందించిన పరిహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌హెచ్–42 ముదిగుబ్బ పరిధిలోని సానిపల్లి రోడ్డు భూ సేకరణకు సంబంధించిన అంశాన్ని స్వయంగా పరిశీలించాలని ధర్మవరం ఆర్డీఓను ఆదేశించారు. అలాగే జిల్లా పరిధిలోని ఎన్‌హెచ్–342, ఎన్‌హెచ్–716జి, ఎన్‌హెచ్–544జి రహదారులకు సంబంధించి అవార్డు పాస్ చేసిన భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. వీలైనంత త్వరగా పరిహారం రైతులకు చెల్లించాలన్నారు. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, నేషనల్ హైవే ఈఈ మధుసూదనరావు, డీఈ గిడ్డయ్య, తహసీల్దార్ నవీన్‌కుమార్, సూపరింటెండెంట్ ఆనంద్, బాషా తదితరులు పాల్గొన్నారు.

● ‘ముక్కోటి’ కాంతులు



కదిరి టౌన్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లాలోని వైష్ణవాలయాలన్నీ దేదీప్యమానంగా కాంతులీనుతున్నాయి. ఉత్తర ద్వార దర్శనానికి భారీగా ఏర్పాట్లు చేశారు. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్తర రాజగోపురం (వైకుంఠ ద్వారం) గుండా భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించనున్నారు. ప్రధాన రాజగోపురంతో పాటు ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. శనివారం తెల్లవారుజామున శ్రీదేవి భూదేవి సమేత వసంతవల్లభుడిని ఉత్తర రాజగోపురం వద్దకు తీసుకువచ్చి భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం కల్పించనున్నారు.



వివిధ పుష్పాలతో తీర్చిదిద్దిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ స్వాగత తోరణం

శతాధిక వృద్ధురాలు మృతి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి



నరసమ్మ(ఫైల్)

నల్లమాడ: మండలంలోని కొత్త చిన్నయ్యగారిపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు కె. నరసమ్మ(105) గురువారం మృతి చెందారు. ఆమె భర్త తిమ్మిరెడ్డి కొన్నేళ్ల క్రితమే మృత్యువాత పడ్డారు. నరసమ్మకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం కాగా, మనవళ్లు, మనవరాళ్లకు కూడా వివాహాలయ్యాయి. అంతా కలిసి దాదాపు 25 మంది సభ్యులుంటారు. అందరి పెళ్లిళ్లు కళ్లారా చూసిన నరసమ్మ మునిమనవళ్లతో ఆనందంగా గడిపేది. అనారోగ్య సమస్యలు తలెత్తడం, వయోభారంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి నరసమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

పుట్టపర్తి మున్సిపాలిటీలో విజిలెన్స్ తనిఖీలు



టౌన్ ప్లానింగ్ గదిలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్‌అధికారులు

పుట్టపర్తి టౌన్: విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం పుట్టపర్తి మున్సిపాలిటీలో తనిఖీలు నిర్వహించారు. మున్సిపాలిటీ, ‘పుడా’ అనుమతుల్లేకుండానే సుబ్బరాజు అనే వ్యక్తి బ్యాంకుల ద్వారా రుణం పొంది పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి గణేష్ కూడలిలో బహుళ అంతస్తుల భవనం నిర్మించి ఇతరులకు ప్లాట్లు విక్రయించాడని పలువురు స్థానికులు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సీఐ రామారావు, డీఈ మోగేష్ బాబు, హెడ్‌కానిస్టేబుల్ మారన్న మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో తనిఖీ నిర్వహించారు. సుబ్బరాజు భవన నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? ఉంటే...ఏ మేరకు అనుమతులు ఉన్నాయని టౌన్‌ప్లానింగ్ ఏఈని ఆరా తీశారు. అలాగే రికార్డులు పరిశీలించారు. అనంతరం విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ, స్థానికుల ఫిర్యాదు మేరకు సుబ్బరాజు భవన నిర్మాణానికి సంబంధించి మున్సిపాలిటీ, ‘పుడా’ అనుమతులు పరిశీలించామన్నారు. అలాగే సదరు భవనానికి సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని రికార్డులతోపాటు రుణం మంజూరు చేసిన బ్యాంక్ పత్రాలనూ పరిశీలించి నివేదికను డైరెక్టర్‌కు పంపుతామన్నారు. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.

క్లుప్తంగా

జెండా స్తంభం కూల్చివేత



స్తంభాన్ని కూలదోసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

రొద్దం: మండలంలోని ఎం.కొత్తపల్లిలో ఇటీవల ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండా స్తంభాన్ని గురువారం రాత్రి టీడీపీ అల్లరి మూకలు కూలదోశాయి. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ వీరేష్, ఆ పార్టీ నాయకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌ఏ రవిశేఖర్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు జె.మారుతీరెడ్డి తదితరులు పరిశీలించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టించేందుకు ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడ్డారని, బాధ్యులను గుర్తించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఐ వలీబాషాను కోరుతూ నాయకులు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



జయంత్ (ఫైల్)

రొద్దం: మండలంలోని పి.రొప్పాల గ్రామానికి చెందిన బోయ నరసింహమూర్తి పెద్ద కుమారుడు జయంత్(17) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఐటీఐ చేస్తున్న జయంత్... తన తండ్రి నూతనంగా చేపట్టిన గృహ నిర్మాణానికి అవసరమైన ఇనుప కడ్డీలను ఇంటి పైకప్పుపై వేస్తుండగా పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ లైన్‌కు కడ్డీలు తగిలి షాక్‌కు గురయ్యాడు. ఘటనలో అక్కడికక్కడే జయంత్ మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ వలీబాషా పరిశీలించి కేసు నమోదు చేశారు.

‘పురం’.. ఎన్నికల గరం

- హిందూపురం కైవసానికి పెద్దిరెడ్డి ప్లాన్
- పదిరోజుల పాటు నియోజకవర్గంలో పర్యటనకు సన్నాహకాలు
- విషయం తెలియగానే ఊడిపడిన ఎమ్మెల్యే బాలకృష్ణ
- టీడీపీ అసంతృప్తులను బుజ్జగించేందుకు మంతనాలు



హిందూపురం అర్బన్: ‘పురం’లో అప్పుడే ఎన్నికల వేడి రాజుకుంది. ఈసారి ఎలాగైనా పురంపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలన్న లక్ష్యంతో ఆ పార్టీ రీజినల్ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని నేతలతో సమావేశాల ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఈ సమావేశాల్లోనే టీడీపీ నుంచి భారీగా చేరికలు ఉంటాయన్న సంకేతాలు అందుకున్న టీడీపీ నేతలు దిద్దుబాటు చర్యలకు దిగారు. దీంతో ఆగమేఘాలపై ఎమ్మెల్యే బాలకృష్ణను పిలిపించి అసంతృప్త నేతలను బుజ్జగించే పనిలో పడ్డారు.

టీడీపీ నేతలతో బాలకృష్ణ సమీక్ష ..

శుక్రవారం సాయంత్రం కొడికొండ చెక్‌పోస్ట్‌కు సమీపంలోని రాగమయూరీ లేఅవుట్‌కు చేరుకున్న బాలకృష్ణ... పంచాయతీల్లోని నాయకులు, కార్యకర్తలకు కబురు పంపారు. చిలమత్తూరు మండలంలోని పంచాయతీల వారీ సమీక్షలు చేపట్టారు. చాలా మంది టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వెళ్లే అవకాశాలు ఉండటంతో ఆయా పంచాయితీల నేతలను బుజ్జగిస్తున్నారు. పార్టీలో సముచిత స్థానంతో పాటు పదవులు కూడా ఇస్తామని హామీలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇన్నాళ్లు తమను పట్టించుకోని బాలయ్య ఇప్పుడొచ్చి ఇచ్చే హామీలు ఏ మేరకు నిలబెట్టుకుంటాడో అన్న అనుమానం కార్యకర్తల్లో నెలకొంది.

కార్యకర్తల నిరుత్సాహం..

బాలకృష్ణ వచ్చినట్లు తెలుసుకున్న కొందరు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలహారాలు తీసుకుని వెళ్లి ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసేందుకు ప్రయత్నించారు. అయితే అక్కడి సెక్యూరిటీ, నాయకులు అనుమతించక పోవడంతో నిరుత్సాహంతో వెనుతిరిగారు. ‘ఎప్పుడో చుట్టపుచూపుగా వస్తాడు...పోనీ అప్పుడైనా కలుద్దామంటే కలవడు... పూలహారాలకు డబ్బులు దండగ’ అంటూ పలువురు కార్యకర్తలు బాలకృష్ణ విడిది చేసిన వసతి గృహం సమీపంలోనే పూలహారాలు పడేసి వెళ్లపోయారు.

మూడు నెలల్లో రూ.1.50 కోట్ల ఖర్చు..

టీడీపీ నేతలు ఇప్పటికే నియోజక వర్గ ఓటరు జాబితాల్లో 60 శాతం మంది వివరాలు వారి ప్రత్యేక యాప్‌లలో సిద్ధం చేసుకున్నారు. ఎన్నికల సమయంలో ఉపయోగ పడేలా ఆధార్, ఓటర్ అకౌంట్ నంబర్ వివరాలు సేకరించారు. బూత్ కన్వీనర్లకు, వారి వద్ద ఉండే వారికి ప్రతి మండలానికి నెలనెలా రూ.5 లక్షల వరకు, పట్టణంలో రూ.20 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇలా నియోజక వర్గ వ్యాప్తంగా మూడు నెలలుగా కేవలం సమాచార సేకరణకే రూ. 1.50 కోట్ల వరకు ఖర్చు చేశారు. వీరే పార్టీ కార్యకర్తలను తీసుకొచ్చే బాధ్యత చూసుకునేలా ఆదేశాలిచ్చారు. అయితే పార్టీలో కొంత మంది ముఖ్య నేతలకు ఇది నచ్చడం లేదు. తమను కాదని బూత్ కన్వీనర్లకు ప్రాధాన్యత ఇవ్వడం మింగుడు పడటం లేదు. ఎన్నికల్లో తామేంటో చూపిస్తామంటున్నారు.

జనసేనకు అంత ప్రాధాన్యతా?

జనసేన, టీడీపీ పొత్తు ప్రకటన నేపథ్యంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ... జనసేన నాయకులను పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడారు. అయితే జనసేన నేతలకు అంత ప్రాధాన్యత ఇవ్వడం టీడీపీ ముఖ్య నేతలకు నచ్చడం లేదు. పార్టీ కోసం తాము ఇన్నాళ్లు కష్టపడితే పట్టించుకోని బాలకృష్ణ... జనసేన నేతలను మాత్రం కూర్చోబెట్టి సత్కారాలు చేయడం మింగుడు పడటం లేదు.

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాక!

ఈసారి ఎలాగైనా హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన వారం రోజుల పాటు నియోజకవర్గంలోనే పర్యటించేందుకు కార్యాచరణ సిద్ధమైంది. అందుకు అనుగుణంగా వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి పంచాయతీలోనూ నాయకులు, కార్యకర్తలను కలుస్తూనే పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ఈ ఎన్నికల్లో హిందూపురంపై జెండా ఎగురవేసేందుకు సిద్ధమయ్యారు. మొత్తంగా హిందూపురంలో ప్రధాన పార్టీల మధ్య రాజకీయ వేడి పుంజుకుంది.

సామాజిక సేవా పురస్కారాల ప్రదానం



జాతీయ సమైక్యతా అవార్డు అందుకుంటున్న బుక్కపట్నం ఉపాధ్యాయుడు ఇషాక్

పెనుకొండ రూరల్/పుట్టపర్తి: సుప్రసిద్ధ పెనుకొండ బాబయ్య స్వామి దర్గా ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని పలువురికి సామాజిక సేవా పురస్కారాలను దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా ఆధ్వర్యంలో డీఎస్పీ హుస్సేన్‌పీరా గురువారం రాత్రి ప్రదానం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 50 మంది సామాజిక సేవకులతో పాటు పెనుకొండకు చెందిన మిట్ట ఆంజనేయ స్వామి డెవలప్‌మెంట్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎంక్యూఏ గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ కలీముల్లా, బ్రహ్మకుమారి డాక్టర్ హేమలత, పర్యావరణ వేత్త భాస్కర్‌నాయుడు, మడకశిర కు చెందిన దళిత హక్కుల పోరాట సమితి హనుమంతు, బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు మాణిక్యం ఇసాక్ తదితరులు పురస్కారాలను అందుకున్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ప్రశంసాపత్రాలు అందుకున్న విజేతలు

పుట్టపర్తి: పుట్టపర్తి పరిధిలోని చిన్నపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రదర్శనను డీఈఓ మీనాక్షి ప్రారంభించి, మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఉపాధ్యాయుల కేటగిరిలో మొదటి స్థానం ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు వసంతరాణి, రెండో స్థానాన్ని నల్లచెరువులోని ఏపీఎంఎస్ ఉపాధ్యాయురాలు సల్మా దక్కించుకున్నారు. మూడో స్థానంలో పరిగి మండలం శాసనకోటలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు రోహిణి నిలిచారు. విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో అగళిలోని ఏపీఎంఎస్ విద్యార్థి యశ్వంత్ మొదటి స్థానం, లేపాక్షిలోని ఎస్‌ఎస్‌ఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థి నితిన్‌కుమార్ రెండో స్థానం, పరిగిలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి ఫరూక్ మూడో స్థానం దక్కించుకున్నారు. అలాగే గ్రూప్ విభాగంలో చిలమత్తూరు జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు నవ్య, సుప్రజ మొదటి స్థానం, హిందూపురం మున్సిపల్ పాఠశాల విద్యార్థులు సిద్ధిక్య, రుకియా, అజీజియా రెండో స్థానం, చెన్నేకొత్తపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన దివ్యశ్రీ, యశస్విని మూడో స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, వివిధ పాఠశాలలకు చెందిన గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన కూలీ కుమారుడు



రమేష్‌నాయక్

మడకశిర రూరల్: మండలంలోని గుండుమల కేఎస్ తండాకు చెందిన రామక్క, నారాయణ నాయక్ దంపతుల రెండో కుమారుడు రమేష్‌నాయక్ ఇటీవల ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఎస్‌ఐ పోస్టుకు అర్హత సాధించారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన ఆయన అక్కడే ఉంటూ పోటీ పరీక్షకు సిద్ధమయ్యారు. రెండు సార్లు పోటీ పరీక్షలో తప్పినా ఆత్మస్థైర్యం కోల్పోకుండా మూడో సారి సివిల్ ఎస్‌ఐ పోస్టుకు అర్హత సాధించాడు. కాగా, గ్రామంలో రమేష్ నాయక్ కుటుంబానికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. రోజు వారీ కూలి పనులతో తల్లిదండ్రులు పిల్లలను చదివించారు. ఇప్పటికే మొదటి కుమారుడు చంద్రానాయక్ గుడిబండ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా, మూడో కుమారుడు బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారు. ఎస్‌ఐగా అర్హత సాధించిన రమేష్ నాయక్‌ను ఈ సందర్భంగా తండా వాసులు అభినందించారు.

ఎస్‌ఐ పోస్టు దక్కించుకున్న ధర్మవరం యువకుడు..



అరుణ్‌వెంకటసాయినాథ్

ధర్మవరం అర్బన్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో ధర్మవరంలోని దుర్గానగర్‌కు చెందిన చంద్రశేఖర్, వరలక్ష్మి దంపతుల కుమారుడు అరుణ్‌వెంకటసాయినాథ్ ఎస్‌ఐ పోస్టుకు అర్హత సాధించారు. స్థానిక జీవానంద పాఠశాలలో పదో తరగతి, సాయికృప కళాశాలలో ఇంటర్, అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన అరుణ్... తర్వాత హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుని పోటీ పరీక్షకు హాజరయ్యారు. ఈ క్రమంలో ఎస్‌ఐగా పోస్టు దక్కించుకున్న కుమారుడిని తల్లిదండ్రులు అభినందించారు.

వసూళ్ల లక్ష్యం సాధించాలి

- మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ రామాంజినేయులు

అనంతపురం అగ్రికల్చర్: మార్కెట్ యార్డులు, చెక్‌పోస్టుల ద్వారా నిర్దేశిత వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలని మార్కెటింగ్‌శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) రామాంజినేయులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఏడీఎం కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని 17 మార్కెట్ యార్డులు, 30 చెక్‌పోస్టుల ద్వారా సాధించిన ప్రగతిపై యార్డుల వారీగా ఆయన సమీక్షించారు. అనంతపురం పరిధిలో ఉన్న 9 మార్కెట్ యార్డుల నుంచి వసూళ్ల లక్ష్యం రూ.10.81 కోట్లు కాగా ఇప్పటి వరకూ 63 శాతం సాధనతో రూ.7 కోట్లు వసూళ్లు జరిగాయన్నారు. ఇందులో గుత్తి, గుంతకల్లు మినహా మిగిలిన ఏడు కమిటీల పరిస్థితి బాగానే ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఉన్న 8 మార్కెట్‌యార్డుల లక్ష్యం రూ.4.72 కోట్లు కాగా ఇప్పటి వరకూ 64 శాతంతో రూ.3.05 కోట్లు వసూలు చేశారన్నారు. ఇక్కడ కూడా తనకల్లు, పెనుకొండ మినహా మిగతా ఆరు మార్కెట్ కమిటీల పరిస్థితి బాగుందన్నారు. పూర్తిగా వెనుకబడిన నాలుగైదు కమిటీల్లో రానున్న మూడు నెలల్లో వసూళ్లు పెంచాలని ఆదేశించారు. గడువు ముగిసేలోపు అన్ని కమిటీలు వంద శాతం లక్ష్యం సాధించేలా చర్యలు తీసుకోవాలని ఏడీఎంలకు సూచించారు.

‘పుడా’ చైర్‌పర్సన్ పదవీకాలం పొడిగింపు



పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ

పుట్టపర్తి: పుడా (పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్ పర్సన్‌గా లక్ష్మీనరసమ్మ పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. లక్ష్మీనరసమ్మ రెండేళ్లుగా ఆ పదవిలో కొనసాగుతున్నారు. సీఎం జగన్ నామినేటెడ్ పదవుల్లో బీసీలకు పెద్ద పీట వేస్తూ.. ఇప్పటికే ఆయా పదవుల్లో ఉన్న వారి పదవీ కాలాన్ని పొడిగించారు. అందులో భాగంగానే లక్ష్మీనరసమ్మ పదవీ కాలాన్ని పొడిగించారు. దీంతో లక్ష్మీనరసమ్మ సీఎం జగన్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

యంత్రం కింద పడి చిన్నారి మృతి

ముదిగుబ్బ: మండలంలోని చెంచుగారిపల్లి తండాలో శుక్రవారం వేరుశనగ యంత్రం కింద పడి ఇస్లావత్ నిశాంత్ నాయక్(3) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వేరుశనగ కట్టి ఆడించిన తర్వాత వాహనాన్ని తీసుకెళ్లే క్రమంలో డ్రైవర్ వెనక్కు నడిపాడు. అప్పటికే వాహనం వెనుక ఉన్న చిన్నారి టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనతో తల్లిదండ్రులు రమణానాయక్, శారదాబాయి రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. పట్నం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మిగులు సీట్లకు

27 నుంచి స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, ఎంబీఏ (ఫైనాన్స్), ఎంసీఏ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను ఈ నెల 27న స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ జి.నరసింహన్ తెలిపారు. ఐసెట్-2023లో అర్హత సాధించిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 27న ఉదయం 10 గంటలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. అడ్మిషన్ పొందే విద్యార్థులు అదే రోజున కోర్సు ఫీజు మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని స్పష్టం చేశారు.

- శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏపీ పీజీ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించిన వారు స్పాట్ అడ్మిషన్లకు అర్హులన్నారు. అడ్మిషన్ పొందిన తక్షణమే కోర్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు.

ఖాళీ పీజీ సీట్లు ఇవే...

అడల్ట్ ఎడ్యుకేషన్-22, అప్లైడ్ ఎకనామిక్స్-38, ఎకనామిక్స్-38, ఇంగ్లిష్-35, హిందీ -12, హిస్టరీ-25, పొలిటికల్ సైన్సెస్-9, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్- 24, సోషియాలజీ -34, తెలుగు-38, రూరల్ డెవలప్‌మెంట్-32, కామర్స్-55, సోషల్ వర్క్-31, కెమిస్ట్రీ -21, అప్లైడ్ మేథమేటిక్స్-21, మేథమేటిక్స్-17, బయోకెమిస్ట్రీ-12, బయోటెక్నాలజీ-9, బోటనీ-17,ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్- 30, జాగ్రఫీ- 23, మైక్రోబయాలజీ -2, ఫిజిక్స్-36, పాలిమర్ సైన్సెస్-15, సెరికల్చర్-3, స్టాటిస్టిక్స్-7, జువాలజీ-17, ఎంఎల్‌ఐఎస్‌సీ- 26, కామర్స్ (అకౌంటింగ్ సైన్సెస్)- 50, ఫిజికల్ ఎడ్యుకేషన్- 37, ఆర్గానిక్ కెమిస్ట్రీ-1, కంప్యూటర్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ -14, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్-31.

మహిళల సహకారంతో ప్రకృతి వ్యవసాయం

- డీఆర్‌డీఏ పీడీ నరసయ్య



పంటలను పరిశీలిస్తున్న సమాఖ్య సభ్యులు

పుట్టపర్తి అర్బన్: మండల మహిళా సమాఖ్యల సహకారంతో జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. పుట్టపర్తి మండలం కొట్లపల్లి, పెడపల్లి, మార్లపల్లి గ్రామాల్లో చేపట్టిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జిల్లాలోని అన్ని మండలాల సమాఖ్య సభ్యులతో కలసి శుక్రవారం ఆయన సందర్శించారు. కొట్లపల్లి రైతులు కేశవరెడ్డి, సుబ్బమ్మ, రామకృష్ణారెడ్డితో సమాఖ్య సభ్యులు సమావేశమై మాట్లాడారు. అక్కడ సాగులో ఉన్న పత్తి, డ్రాట్ ప్రూఫింగ్, ఏటీఎం మోడల్‌లను పరిశీలించారు. రైతులు సొంతంగా తయారు చేసుకుంటున్న ఘనామృతం, జీవామృతం తదితర సేంద్రియ ఎరువుల తయారీ విధానాలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఒనగూరే లాభాలను అధికారులు డెమో ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పీడీ నరసయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతుల జీవనోపాధులు పెంచేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. ఇవన్నీ అధికంగా వ్యాపారాత్మకంగానే ఉండగా ప్రస్తుతం వ్యవసాయంలో సైతం తగిన సూచనలు, సలహాలు ఇచ్చి సాగు విస్తీర్ణం మరింత పెంచడమే కాక ప్రతి గ్రామంలోనూ ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా రైతుల్లో చైతన్యం తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఇందులో మహిళా సంఘాల సభ్యులను భాగస్వాములను చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీపీఎం ఐబీ నాగరాజు, జీవనోపాధుల డీపీఎం రామమోహన్, ఫైనాన్స్ డీపీఎం రామిరెడ్డి, ఏపీఎంలు లలిత, ఏజీఎం వేణు, ఎల్‌సీ రామమోహన్, సీసీలు, వీఓఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సాకప్ప, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు లక్ష్మీదేవి, రహమత్‌జాన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

జనవాక్కు

రూ.1.85 లక్షలకు పైగా లబ్ధి



వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వివిధ సంక్షేమ పథకాల ద్వారా మా కుటుంబానికి రూ. 1,85,128 లబ్ధి చేకూరింది. గతంలో ఏ ప్రభుత్వములోనూ ఇంత పెద్దగా లబ్ధి పొందింది లేదు. ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారు. మా దీవెనలు వైఎస్ జగన్‌కే.

– లక్ష్మమ్మ, జిల్లెడుగుంట, మడకశిర మండలం

జగనన్నకు రుణపడి ఉంటా



గతంలో ఏ ప్రభుత్వమూ పేదలకు ఇంత మేలు చేయలేదు. అమ్మ ఒడి పథకం కింద పిల్లల చదువులకు రూ.55 వేలు లబ్ధి చేకూరింది. డ్వాక్రా సంఘాల రుణమాఫీలో భాగంగా రూ.75 వేలు నా బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. గతంలో నాయకులు ఇది చేస్తాం.. అది చేస్తామని చెప్పేవాళ్లే కాని ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఏనాడూ మా కాలనీల్లో పర్యటించింది లేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులూ కాలనీల్లో తిరుగుతూ మా సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ఇలాంటి పాలననే అందరూ కోరుకుంటారు. ఆ దేవుడు జగనన్నను చల్లగా దీవించి, మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరుకుంటున్నా.

– సబీనా, అమరాపురం

లక్షాధికారిని చేశారు



నేను, నా భర్త శ్రీకంఠప్ప కూలి పనులతో జీవనం సాగిస్తున్నాం. మాకు ఇద్దరు కుమార్తెలున్నారు. కూలి సొమ్ము కుటుంబపోషణకే సరిపోక ఇబ్బంది పడేవాళ్లం. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వివిధ పథకాల ద్వారా మా కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగుపడింది. ఇంటి స్థలంతో పాటు పక్కా గృహ నిర్మాణమూ మంజూరు చేశారు. వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18,750, ఆసరా పథకం కింద ఏటా రూ.7వేలు అందుకున్నా. నా చిన్న కుమార్తెకు అమ్మఒడి పథకం, పెద్ద కుమార్తెకు వసతి దీవెన పథకాలు వర్తించాయి. పూట గడవక ఇబ్బంది పడే పరిస్థితిలో ఉన్న మమ్మల్ని లక్షాధికారులను చేసిన సీఎం వైఎస్‌జగన్‌కు ఎంతో రుణపడి ఉన్నాం.

– వాణమ్మ, ఫళారం గ్రామం, గుడిబండ మండలం

మళ్లీ జగనే రావాలి



పేదల పక్షపాతిగా నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలి. లేకపోతే సంక్షేమ పథకాలు వర్తించక పేదలు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలిన సొంతిల్లు జగన్ ప్రభుత్వంలోనే నాకు సాకారమైంది. అంతేకాక సీజన్ ఆరంభంలోనే రైతు భరోసా వర్తింపజేస్తుండడంతో వ్యవసాయానికి పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన బాధతప్పింది. అమ్మ ఒడి పథకం వర్తించడంతో నా కుమారుడిని చదివించకోగలుగుతున్నాం. మా కుటుంబం ఈ రోజు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవిస్తోందంటే దానికి సీఎం వైఎస్ జగనే కారణం. ఇలాంటి ప్రభుత్వం కలకాలం నిలవాలని కోరుకుంటన్నా.

– మహేష్, శ్రీరంగాపురం, బెళుగుప్ప మండలం

స్కూటీ అదుపు తప్పి విద్యార్థికి గాయాలు



గాయపడ్డ లక్ష్మీపతి

మదనపల్లె: స్కూటీ అదుపు తప్పి బీటెక్ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం ఎర్రకుంట్లకు చెందిన నారాయణస్వామి కుమారుడు ఎం.లక్ష్మీపతి... అంగళ్లులోని పీజీ హాస్టల్‌లో ఉంటూ మిట్స్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం తన స్నేహితుడు చందు స్వగ్రామం పెనుకొండకు వెళుతుండగా, సీటీఎం రైల్వేస్టేషన్‌లో దింపేందుకు స్కూటీలో వెళ్లాడు. స్నేహితుడిని స్టేషన్‌లో దింపి తిరిగి అంగళ్లుకు వస్తుండగా అండర్‌బ్రిడ్జి సమీపంలో స్కూటీ అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు గుర్తించి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.